క్లుప్తంగా

కానిస్టేబుల్‌కు ఆర్థిక చేయూత



నగదు అందిస్తున్న సహచర పోలీసులు

పెద్దపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ సునీల్‌కు 2012 బ్యాచ్‌కు చెందిన సహచర పోలీసులు అండగా నిలిచారు. వైద్యఖర్చుల కోసం సేకరించిన రూ.2లక్షలు అందించారు. ప్రభాకర్, చంద్రశేఖర్, మహేందర్, సతీశ్ ఉన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

జ్యోతినగర్: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపించాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం గొర్రె జయరాజు, ఉపాధ్యాయురాలు స్వర్ణలత, పెర్కారి శ్రీధర్‌రావు, జావిద్, గూళ్ల అంజన్‌కుమార్, తిరుపతి, కల్పన, రమ పాల్గొన్నారు.

మహిళల రక్షణ కోసం షీటీం పనిచేస్తుంది



అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై మల్లన్న

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఆర్‌ఎఫ్‌సీఎల్‌లోని ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించారు. షీ టీం ఇన్‌చార్జి ఏఎస్సై మల్లన్న మాట్లాడారు. మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతీరోజు మహిళల రక్షణ కోసం బస్టాండ్ ప్రధాన కూడళ్లలో షీటీం అందుబాటులో ఉంటుందన్నారు. మహిళలు వేధింపులకు గురైతే షీటీం హెల్ప్‌లైన్ నంబర్ 63039 23700 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళలు బెదిరింపులకు గురైతే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. షీటీం సభ్యులు స్నేహలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

ఓదెల: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించిందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు మ్యాడగోని శ్రీకాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని మడకలో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. రేషన్ కార్డులను అర్హులకు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను ఆన్‌లైన్‌లో మాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి మాయమాటలతో మభ్యపెడుతోందని ఆరోపించారు.

నాలుగో రోజుకు చేరిన ఆర్టిజన్ల దీక్ష

పెద్దపల్లిరూరల్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న తమను ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ ఆర్టిజన్లు చేపట్టిన రిలేదీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. విద్యుత్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న తమకు తీరని అన్యాయం జరుగుతోందని ఆర్టిజన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వాగునాయక్ అన్నారు. బీఎస్పీ నాయకులు రాజనర్సు, గోపాల్, బొందాలు, బాబు తదితరులు గురువారం సంఘీభావం తెలిపారు. టీఆర్‌కేవీఎస్ నాయకులు సుధాకర్, రాజయ్య, కుమార్, లింగారెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు.

దీక్షా వేదిక మార్పు..

నాలుగు రోజులుగా ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఆఫీసు ఎదుట చేపట్టిన రిలేదీక్షా శిబిరాన్ని శుక్రవారం నుంచి పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని డీఈ ఆఫీసు వద్దకు మార్చుతున్నట్లు జిల్లా నాయకులు పేర్కొన్నారు. ఆర్టిజన్ సంఘం నాయకులు రాఘవాపూర్‌లో దీక్ష శిబిరానికి రావాలని కోరారు.



పెద్దపల్లిరూరల్: అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు



జూలపల్లి: జాబితాలో తమ పేరు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తున్న ప్రజలు



కమాన్‌పూర్: జాబితాలో తమ పేరు రాలేదని నిరసన తెలుపుతున్న మహిళలు



రామగిరి: నాగెపల్లిలో అధికారులను ప్రశ్నిస్తున్న మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు



ఎలిగేడు: అధికారులతో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు



ధర్మారం: ఎర్రగుంటపల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

రసాభాసగా గ్రామసభలు

- అర్హులకు పథకాలు అందట్లేదని ఆందోళన

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రంగాపూర్‌లో గురువారం జరిగిన ప్రజాపాలన గ్రామసభలో పథకాల ఫలాలు అర్హులకు అందలేదంటూ గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

రామగిరి: మండలంలోని బేగంపేట, లొంకకేసారం, నవాబ్‌పేట, నాగేపల్లి, చందనాపూర్‌లో గ్రామసభలు నిర్వహించారు. నాగెపల్లిలో మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు అర్హులకు పథకాలు ఎందుకు వర్తించవంటూ అధికారులను ప్రశ్నించారు.

ఎలిగేడు: మండలంలోని ఎలిగేడు, సుల్తాన్‌పూర్, ముప్పిరితోట గ్రామాల్లో జరిగిన గ్రామసభలు రసాభాసగా మారాయి. ఎలిగేడు, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలో అర్హులకు కాకుండా అనర్హుల పేర్లు వచ్చాయని మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన చేశారు. మండల ప్రత్యేక అధికారి నరేశ్‌కుమార్, తహసీల్దార్ బషీరొద్దీన్, డిప్యూటీ తహసీల్దార్, ఎంపీవో అరిఫ్, ఏవో ఉమాపతి, ఏపీఎం సుధాకర్, ఈజీఎస్ టీఏ రంజిత్, ఏఈవోలు పాల్గొన్నారు.

జూలపల్లి: జూలపల్లిలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. పేదలకు పథకాలు రాలేదని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్, కోనరావుపేట, జూలపల్లిలో మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధక ఏడీ శంకర్ గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీవో పద్మజ, తహసీల్దారు స్వర్ణ, ఏవో ప్రత్యూష, ఏపీవో సదానందం, ఎంపీవో అనిల్ రెడ్డి, ఆర్ఐ సదయ్య, ప్రత్యేకాధికారి అటవీశాఖాధికారి నాగయ్య, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ ఏరియాలో స్థానిక సీఈఆర్ క్లబ్‌లో గురువారం వార్డు సభ నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్, డివిజన్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని ఎర్రగుంటపల్లి నర్సింగపూర్, పెర్కపల్లి, తండాబి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో తమ పేర్లు లేకపోవటంతో ప్రజలు అధికారులను నిలదీశారు. ఎర్రగుంటపల్లిలో బీఆర్‌ఎస్ నాయకుడు కొత్త మోహన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు జాబితాపై మండిపడ్డారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్ల జాబితాల్లో తమ పేర్లు రాలేదని పలువురు మహిళలు కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిరసన తెలిపారు. కమాన్‌పూర్‌కు చెందిన గంభీరావుపేట లక్ష్మితో పాటు తూండ్ల రాజమణి, జూపాక సుమలత, సజ్జనపు మణెమ్మ, ఎస్‌కే పరివిన్ నిరసన తెలిపారు.

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లె అంబేడ్కర్ భవన్‌లో జరిగిన వార్డుసభలో ప్రజలు దరఖాస్తులు అధికారులకు అందించారు. కార్పొరేటర్ కల్వచర్ల కృష్ణవేణి, మాజీ కార్పొరేటర్ వెంగల పద్మలత, నాయకులు ఈదునూరి రవి, శంకర్, బాపు పాల్గొన్నారు.

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్, ఎల్లంపల్లి, పొట్యాల, ఎగ్లాస్‌పూర్, కార్పొరేషన్ 21వ డివిజన్ స్థానిక రైల్వేస్టేషన్ ఏరియా పాత ఎంపీడీవో కార్యాలయంలో గ్రామసభలు జరిగాయి. కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, ఎంపీడీఓ ఎంఎ.అలీం, జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య హాజరయ్యారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



మాట్లాడుతున్న నగర మేయర్ అనిల్‌కుమార్

కోల్‌సిటీ: అర్హులందరికీ ప్రాధాన్యత ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని రామగుండం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అన్నారు. కార్పొరేషన్ 30వ డివిజన్‌లోని సీతానగర్‌లో గురువారం నిర్వహించిన వార్డుసభలో మేయర్ మాట్లాడారు. అర్హులందరూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందుతారన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కొత్త రేషన్‌కార్డులను ఈ నెల 26 నుంచి పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వార్డు సభలో తహసీల్దార్ కుమారస్వామి, నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ రాయలింగు, ఏఈ మీర్, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే గురువారం 5, 10, 15, 20, 25, 29, 30 35, 40, 45, 50వ డివిజన్లలో కూడా వార్డు సభలు ఆయా డివిజన్ల కార్పొరేటర్ల ఆధ్వర్యంలో డివిజన్ ఆఫీసర్లు నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



రామగిరి: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆంగ్ల నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో పీవో వెంకటరమణ ఆవిష్కరించారు. మేనేజర్ రామరావు, అధికారులు నాగేశ్వరరావు, నాయకులు కోట రవీందర్‌రెడ్డి, ఎం.రామచంద్రారెడ్డి, బత్తుల శంకర్, మనోహర్ పాల్గొన్నారు.

ఉచిత పథకాలతో ప్రజలను మభ్యపెడుతున్నారు

కమాన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారే తప్ప అర్హులైన పేదలకు ఉచిత పథకాలు అందించడం లేదని అఖిలపక్షం నాయకులు ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నారే తప్ప పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో మచ్చగిరి రాము, బోనాల వెంకటస్వామి, నల్లవెల్లి శంకర్, రాణవేన లక్ష్మణ్, బొమ్మగాని అనిల్, గుర్రం లక్ష్మిమల్లు, మల్లారపు అరుణ్, జంగపెల్లి అజయ్ పాల్గొన్నారు.

నర్సయ్యపల్లిలో..

సుల్తానాబాద్‌రూరల్: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు సంబంధించిన క్యాలెండర్‌ను మండలంలోని నర్సయ్యపల్లిలో జరిగిన గ్రామసభలో గురువారం అదనపు కలెక్టర్ వేణు ఆవిష్కరించారు. సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్ తిరుమల్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్, గర్రెపల్లి సింగిల్‌విండో చైర్మన్ సందీప్‌రావు, ఏవో డేవిడ్‌రాజు, పంచాయతీ కార్యదర్శి, ఏఈవో ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• అందరికీ అనువైన స్థలం కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని టీటీఎస్ అంతర్గాం స్పిన్నింగ్, వీవింగ్ మిల్లు కార్మిక కుటుంబాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరిన క్వార్టర్లలో నివాసం ఉంటున్నారు. ఇందులోని అర్హులకు ఇందిరమ్మ పథకంలో భాగంగా లబ్ధిదారులకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఉన్న (సర్వే నెం.255/1) ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. గురువారం లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం అందజేశారు. ఇండిబిల్లి రామకృష్ణ, అబ్దుల్ మెహరాజొద్దీన్, మాదాసు ఉదయ్‌కుమార్, సురేశ్ కుమార్, మధు, అప్పాయమ్మ ఉన్నారు.

• వాసవ్య విద్యాలయంలో వ్యాసరచన పోటీలు

గోదావరిఖనిటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా స్థానిక రమేశ్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయం విద్యార్థులకు ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, ఫర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాల నివాళి అర్పించారు. అనంతరం టీబీజీకేఎస్ నాయకులు వడ్డేపల్లి శంకర్, పాత్రికేయులు కిషోర్‌యాదవ్, పూసాల మోహన్ విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రస్ట్ నిర్వాహకులు దాసరి స్వప్న మహేశ్, పాఠశాల నిర్వాహకులు బండి చంద్రమౌళి పాల్గొన్నారు.

• సెల్‌ఫోన్ అప్పగింత

రామగిరి: రామగిరి పోలీసుస్టేషన్ పరిధిలోని నాగెపల్లికి చెందిన పనస రాజేందర్ తన ఫోన్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. కాగా గురువారం ఎస్సై పెట్టం చంద్రకుమార్ మొబైల్ ఫోన్ అందజేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలను సీఈఐఆర్‌లో నమోదు చేయాలని సూచించారు.

• నూతన కమిటీ ఏర్పాటు

మంథని: జగద్గురువులు ఆదిశంకరాచార్య బోధనలు, సనాతన ధర్మవ్యాప్తి, మంథని శంకర మఠం నిర్మించడానికి గురువారం ఆదిశంకర భక్త సమితి ఏర్పాటు చేశారు. మంథని పట్టణంలోని సీతారామ సేవాసదన్‌లో జరిగిన సమావేశంలో గట్టు నారాయణ గురూజీ అధ్యక్షతన నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా రాజవరం రాధాకిషన్, ప్రధాన కార్యదర్శిగా లోకె మనోహర్, ఉపాధ్యక్షులుగా సువర్ణ చంద్రశేఖర్, సువర్ణ శ్రీనివాసరావు, గట్టు రమేశ్, సాంస్కృతిక సాహిత్య కార్యదర్శిగా రంగి సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా నల్లగొండ శ్రీనివాస్, కోశాధికారిగా సువర్ణ రాజేందర్, ఐటీ సెల్ హెడ్‌గా రాజావరం సచీంద్రను ఎన్నుకున్నారు.

• విద్యార్థులందరికీ అపార్ కార్డులు

కాల్వశ్రీరాంపూర్: దేశ పౌరులకు ఆధార్‌కార్డులు ఉన్నట్టుగా ప్రతీ విద్యార్థికి అపార్ ఐడీ నంబర్లు (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ)తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఎంఆర్‌సీ భవన్‌లో వర్క్ షాపు ఏర్పాటు చేశామని ఎంఈవో మహేశ్ తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్లో చదువుతున్న విద్యార్థులందరికీ అపార్ ఐడి తప్పనిసరి అన్నారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్ జాలిగం రమేశ్, సీసీవో సుంకరి రమేశ్, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

• మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

మంథని: తెలంగాణ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల కూచిరాజ్‌పల్లిలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల తెలిపారు. 5వ తరగతిలో పూర్తి 40 సీట్లతో పాటు 6వ తరగతిలో పరిమిత సంఖ్యలో బ్యాక్‌లాగ్ మైనార్టీ కేటగిరి సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2024-25లో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు 2025-26కు గాను 5వ తరగతికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఐదో తరగతి ముస్లిం మైనార్టీకి-28, క్రిస్టియన్స్-2, బీసీ-5, ఎస్సీ-2, ఎస్టీ-2, ఓసీ-1 సీటు చొప్పున కేటాయించినట్లు వివరించారు. 6వ తరగతిలో 9 ముస్లిం కోటా సీట్లు ఉన్నాయన్నారు. వివరాలకు 79950 57944 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

• యువకుడి రక్తదానం

కోల్‌సిటీ: గోదావరిఖని రమేశ్‌నగర్‌కు చెందిన పీక భరత్ గురువారం తన పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లోని బ్లడ్ సెంటర్‌లో స్వచ్ఛందంగా రక్తదానం చేశాడు. 44వ డివిజన్ కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్‌గా వ్యవహరిస్తున్న భరత్‌ను, డివిజన్ కార్పొరేటర్ ఎండీ.ముస్తాఫా, జిల్లా కోఆర్డినేటర్ దూళికట్ట సతీశ్, పీక అరుణ్‌కుమార్ అభినందించారు.

బడిబయట పిల్లల సర్వే



రామగుండం: ప్రబంధ్ పోర్టల్ ఎంట్రీలో భాగంగా 6 నుంచి 14 ఏళ్ల వయసు మధ్య బడి మానేసిన విద్యార్థులు, 15 నుంచి 19 ఏళ్ల వారిలో 30రోజులు వరుసగా పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాల సేకరణ చేపట్టాలని విద్యాశాఖ ఆదేశించింది. గురువారం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ) తీగుట్ల శ్రీనివాస్ అంతర్గాం మండల పరిధిలోని గ్రామాల్లో క్షేత్ర సర్వే చేపడుతున్నారు. ఆకెనపల్లిలో ఒక విద్యార్థిని గుర్తించినట్లు తెలిపారు.

వరినాట్లకు సిద్ధం



కమాన్‌పూర్: కమ్ముకున్న మంచుపొగలో వరినాట్లు వేయడానికి సిద్ధం చేస్తున్న భూములు కనువిందు చేస్తున్నాయి. కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్ ఆయకట్టు కింద రైతులు పొలాలు దున్నించి వరినాట్లు వేస్తున్నారు.

యూనియన్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



నియామక పత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: రాబోయే యూనియన్ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలుపే లక్ష్యంగా అందరినీ కలుపుకుని పనిచేయాలని యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ సూచించారు. స్థానిక జనక్‌భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్‌గా బదావత్ శంకర్‌నాయక్‌ను నియమించారు. ఈ మేరకు నియామక పత్రం అందజేశారు. ప్రస్తుతం వైస్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్న కొత్త సత్యనారాయణరెడ్డిని కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా పదోన్నతి కల్పించినట్లు పేర్కొన్నారు. సెంట్రల్ నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, అక్రమ్, దాస్, వికాస్‌కుమార్‌యాదవ్, సదానందం, గడ్డం కృష్ణ, సంపత్‌రెడ్డి, నాచగోని దశరథంగౌడ్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేయాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జీఎం రఘుపతి

రామగిరి: ఆర్జీ-3 ఏరియాలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి జీఎం గుంజపడుగు రఘుపతి అధికారులను ఆదేశించారు. మండలంలోని సెంటినరీకాలనీ రాణిరుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. నిర్దేశించిన పనులు త్వరగా పూర్తి చేసి వేడుకలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులు వారి కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు, ఆయా యూనియన్ల నాయకులు, అధికారులు గణతంత్ర దినోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సివిల్ డీజీఎం రాజేంద్రకుమార్, పర్సనల్ మేనేజర్ బి.సుదర్శనం, ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, అధికారులు శ్రీహరి, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

మారుపేర్ల బాధితుల సమస్య పట్టించుకోవడం లేదు



మాట్లాడుతున్న మారుపేర్ల బాధితులు

గోదావరిఖని: కన్నీరు పెట్టుకున్నా మారుపేర్ల బాధితుల సమస్యను సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాలు పట్టించుకోవడం లేదని కార్మికుల పిల్లలు వాపోయారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం వారు మాట్లాడారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద మారుపేర్ల ఉద్యోగుల పిల్లలందరికీ న్యాయం చేయాలని కోరారు. నాయకులు ఓంప్రకాశ్, దుమ్మటి రాజు, లక్క శ్రవణ్, సుధాకర్, సందీప్, జిల్లాల శ్రావణ్, తిరుమల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్టీపీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ముత్యంరావు, నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగుల సమస్యలు యాజమాన్యం పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ అన్నపూర్ణ కాలనీలోని యూనియన్ కార్యాలయంలో గురువారం ఈదునూరి భూమయ్య అధ్యక్షతన ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 5న అన్ని కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

సీఐటీయూ నుంచి బహిష్కరణ..

ఎన్టీపీసీ యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్‌కు నమ్మకద్రోహం చేసి, యూనియన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న రామంచి సాంబయ్య, రాచపల్లి సంపత్, సీహెచ్ శంకర్‌ను యూనియన్ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో యునైటెడ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బిక్షపతి, జిల్లా కోశాధికారి రామాచారి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూమయ్య, ఉపాధ్యక్షులు సారయ్య, ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, కోశాధికారి బిక్షపతి పాల్గొన్నారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళి



ధర్మారం: నేతాజీ అక్షరాల ఆకారంలో విద్యార్థులు



పెద్దపల్లిరూరల్: బీజేపీ ఆధ్వర్యంలో



కమాన్‌పూర్: నివాళి అర్పిస్తున్న నాయకులు



సుల్తానాబాద్: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతోత్సవాలు పెద్దపల్లిలో గురువారం జరిగాయి. పట్టణంలోని సుభాష్‌విగ్రహానికి సుభాష్‌యూత్ సభ్యులతో పాటు ప్రజాసంఘాలు, ఫార్వర్డ్‌బ్లాక్ ఉమ్మడి జిల్లా ప్రధానకార్యదర్శి బొంకూరి సురేందర్‌సన్నీ తదితరులు పూలమాలలు వేశారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు పర్వతాలు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాకేశ్, మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, నాయకులు పాల్గొన్నారు. పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లో నాయకుడు మిట్టపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

మంథని: మండలంలోని గుంజపడుగులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉదరి శంకర్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్, మాజీ సర్పంచ్ ఉదరి ఓదెలు పాల్గొన్నారు.

ధర్మారం: సాయిమణికంఠ హైస్కూల్‌లో గురువారం పరాక్రమ్ దివస్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేతాజీ పేరు ఏర్పడేలా విన్యాసాలు చేశారు. ఆజాద్ హిందు ఫౌజ్ గుర్తు చేసుకునేలా పరేడ్ నిర్వహించారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గోదావరిఖనిటౌన్: స్థానిక శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిఫా, నేషనల్ యూత్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. స్నేహసాహితి గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ జి.రాజేందర్, ఎన్‌వైపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.యాదవరాజు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: మండల కేంద్రంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని మేడారంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఏబీవీపీ నగరశాఖ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ఎస్సై శీలం లక్ష్మణ్, ఏబీవీపీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం క్రీడాపోటీలు ప్రారంభించారు. ఏబీవీపీ జిల్లా కార్యదర్శి బండి రాజశేఖర్, నగర కార్యదర్శి ఆకుల వంశీ, ఎస్‌ఎఫ్‌ఎస్ రాష్ట్ర కోకన్వీనర్ ఓమేశ్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, వ్యవసాయ చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ముత్యంరావు ఆరోపించారు. పెద్దపల్లిలోని జెండా కూడలిలో గురువారం పోస్టర్ ఆవిష్కరించారు. సీపీఎం రాష్ట్ర మహాసభలు 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరుగుతాయని, అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు రవీందర్, అశోక్, శ్రావణ్, ప్రశాంత్, నవీన్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

స్టేట్ హైవే సాధన సమితి సంతకాల సేకరణ

జూలపల్లి: గ్రామీణ ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధించేందుకు స్టేట్ హైవే నిర్మాణంతోనే సాధ్యమని జూలపల్లి స్టేట్ హైవే సాధన సమితి కన్వీనర్ మారం తిరుపతియాదవ్ అన్నారు. కాళేశ్వరం నుంచి కామారెడ్డి వరకు గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ స్టేట్ హైవే నిర్మించాలని కోరుతూ జూలపల్లిలో సాధన సభ్యులు సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ గ్రామాల్లో సదుపాయాలు కల్పిస్తే అన్నిరకాలుగా అభివృద్ధి సాధిస్తాయని, మెరుగైన రోడ్ల నిర్మాణంతో మారుమూల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సభ్యులు వెంకటరమణ పాల్గొన్నారు.